


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 07-06-2022 సంపుటి : 03 సంచిక : 258 పేజీలు : 4 వెల : రూ 3-00


## సమగ్ర భూ సర్వే ప్రధాన లక్ష్యం అదే.. సీఎం జగన్

అమరావతి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం (సమగ్ర సర్వే)పై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. సమగ్ర సర్వే వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. ఇప్పటివరకూ జరిగిన సర్వే ప్రగతిని సీఎం సమీక్షించారు. సమగ్ర సర్వే కారణంగా అన్ని భూ వివాదాలు పరిష్కారం అవుతాయని సీఎం అన్నారు. దశాబ్దాల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

ఈ సందర్భంగా సీఎం ఏమన్నారంటే..:
భూ వివాదాలను పరిష్కరించడం అన్నది సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యాల్లో ఒకటి
నిర్దేశించుకున్న సమయంలోగా పూర్తిచేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోండి
అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని, సాంకేతిక పరికరాలను అవసరాలకు అనుగుణంగా తెప్పించుకోవాలని ఆదేశించిన సీఎం
డ్రోన్లు, ఓఆర్ఐ పరికరాలు, రోవర్లు,



అలాగే సర్వే రాళ్లు సమకూర్చుకోవడం... ఇలా ప్రతి అంశంలోనూ వేగం ఉండాలన్న సీఎంసర్వే కార్యక్రమాన్ని అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
100 ఏళ్ల తర్వాత సర్వే జరుగుతోందని, ఈ సర్వేను పూర్తిచేయడం ద్వారా ప్రజలకు, రాష్ట్రానికి మేలు జరుగుతుందన్న సీఎం
సమీక్షా సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, అటవీ పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజేయ కల్లాం, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎపిలో దుమ్మురేపిన అమ్మాయిలు



అమరావతి,జూన్6: ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాల్లో ప్రకాశం ముందుండగా, అనంత వెనకబడింది. అలాగే బాలికలే ముందంజలో ఉన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 6 లక్షల 15 వేల 980 మంది విద్యార్థులు హాజరు కాగా 4లక్షల 14,281 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 3 లక్షల16,820 మంది పరీక్షలు రాయగా 2 లక్షల 2081 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు రెండు లక్షల 99వేల 85 మంది పరీక్షలు రాయగా రెండు లక్షల 11వేల 460 మంది పాసయ్యారు. ఈసారి కూడా బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు. 797 పాఠశాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు. 71 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాసు కాలేదని బొత్స వెల్లడించారు. రాష్ట్రంలోని 23 జిల్లాలో ప్రకాశం జిల్లాలో అత్యధిక సంఖ్యలో 78.30శాతం మంది విద్యార్థులు పాసయ్యారని ఆయన వివరించారు. అనంతపురం జిల్లాలో అత్యల్పంగా ఉత్తీర్ణత శాతం నమోదైంది. పక్కనున్న నాలుగు

పదోతరగతి ఫలితాల్లో మళ్లీ వారే టాప్
78.30శాతం ఫలితాలతో ప్రకాశం టాప్
49.7 శాతంతో వెనకబడ్డ అనంత జిల్లా
71 పాఠశాలల్లో నిల్ రిజల్ట్
ఫలితాలువిడుదల చేసిన మంత్రి బొత్స

రాష్ట్రాల్లో కంటే ముందుగా పది పరీక్షల ఫలితాలను విడుదల చేయడం రికార్డు అని ఆయన పేర్కొన్నారు. ఫలితాల్లో మరోసారి బాలికలు తగ్గేదేలే అన్నట్లుగా తమ సత్తా చాటారు. ఫలితాల్లో 78.3శాతంతో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా.. 49.7 శాతంతో అనంతపురం జిల్లా ఆఖరిస్థానానికి పరిమితమైంది. బాలికలు 70.70శాతం, బాలురు 64.02 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మంత్రి తెలిపారు. జులై 6 నుంచి 15వరకు పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు.. మంత్రి బొత్స వెల్లడించారు. రేపట్నుంచి సప్లమెంటరీ ఫీజు చెల్లించవచ్చని తెలిపిన ఆయన.. ఈనెల 13 నుంచి ప్రత్యేక శిక్షణా తరగతులు పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఫలితాలు త్వరగా విడుదల చేసి రెగ్యులర్ విద్యార్థులతో పాటు.. సప్లిమెంటరీ విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించనున్నట్లు వివరించారు.

## పవన్ పోరాటం ప్రజల కోసం కాదు.. పొత్తుల కోసం: మంత్రి రోజా



నెల్లూరు జిల్లా: పవన్ పోరాటం ప్రజల కోసం కాదు.. పొత్తుల కోసం అని మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, 2019లో పవన్‌ను రెండు చోట్ల ప్రజలు ఓడించారు. 2024లో కూడా అదే రిపీట్ అవుతుంది. చంద్రబాబుది రెండు కళ్ల సిద్ధాంతం. టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రోజా అన్నారు. బద్వేలుకి మించిన మెజారిటీ ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీకి వస్తుంది. బద్వేలులో బిజేపీకి వెనుక నుంచి మద్దతు ఇచ్చిన టీడీపీ, జనసేన ప్రయత్నాలు ఫలించలేదని మంత్రి రోజా అన్నారు.

## ఏపీలో రాజకీయ మార్పునకు కృషి చేయాలి : నడ్డా

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ మార్పునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పిలుపునిచ్చారు. విజయవాడలో బీజేపీ బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ స్కీం పేరును ఏపీ సీఎం జగన్ మార్చి ఆరోగ్యశ్రీ పేరిట అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వస్తున్న నిధులు కిందిస్థాయి వర్గాలకు అందుతున్నాయా? లేదా అని పరిశీలించి వారికి అండగా నిలవాలని కోరారు. నిరుపేదలకు మంజూరు చేస్తున్న ఇండ్లు, తదితర వాటి వల్ల కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకోవాలని కార్యకర్తలకు వెల్లడించారు. కేంద్రం రైతులకు అందజేస్తున్న నగదు పథకం గురించి వివరించాలని కోరారు. ఏటా రెండు లక్షల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేస్తుందని నడ్డా పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ఏపీకి అందజేస్తున్న పథకాలను ప్రజానికానికి స్పష్టంగా తెలియజేయాలని కోరారు. భారత దేశాన్ని సురక్షిత దేశంగా ఉంచేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని సూచించారు. ఏపీలో పదివేలకు పైగా శక్తి కేంద్రాలున్నాయని ,వీటిలో అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని సూచించారు.



## బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు శుభవార్త



తాడేపల్లి: ఏపీలో బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జూన్ 17లోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉద్యోగుల బదిలీల ఫైల్‌పై సీఎం వైఎస్ జగన్ సంతకం చేశారు. దీనికి సంబంధించి త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

## కరెన్సీ నోట్లపై మహాత్ముడి చిత్రం మార్చే ఆలోచన లేదన్న ఆర్‌బీఐ



న్యూఢిల్లీ : కరెన్సీ నోట్లపై మహాత్మా గాంధీ చిత్రం మార్పుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం కరెన్సీపై ఉన్న గాంధీ ముఖ చిత్రాన్ని మార్చే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేసింది. భారతీయ కరెన్సీ నోట్లపై మార్పులు చేయాలని ఆర్‌బీఐ యోచిస్తున్నట్లుగా మీడియాలో వార్తలు వస్తున్నాయని.. ఇలాంటి ప్రతిపాదనేదీ లేదని, ఈ విషయాన్ని గమనించాలని కోరుతూ సోమవారం ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న కరెన్సీపై విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌తో పాటు మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫొటోలను కరెన్సీపై ముద్రించేందుకు ఆర్‌బీఐ సిద్ధమవుతుందన్నట్లుగా వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్‌బీఐ త్వరలోనే కీలకమైన ముందడుగు వేయవచ్చని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న భారతీయ కరెన్సీ, నోట్లలో ఎలాంటి మార్పులు చేయాలనే ప్రతిపాదన ఏమీ లేదని, ఇలాంటివి కేవలం ఊహాగానాలేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది.

## బిజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి: పురంధరేశ్వరి

అమరావతి: బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ పురంధరేశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో 0.83 శాతం మేర ఓట్లే వచ్చాయని తెలిపారు. కేంద్రం నిధులను రాష్ట్రం దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. ఏపీలో వైసీపీ వచ్చాక అభివృద్ధి రివర్సులో ఉందని విమర్శించారు. పెట్టుబడిదారులు పక్క రాష్ట్రానికి వెళ్లిపోతున్నారని తెలిపారు. ఏపీలో శాంతి భద్రతలు సక్రమంగా లేవని పురంధరేశ్వరి ధ్వజమెత్తారు.

## నైరుతి ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు



పొంగిపొర్లిన వాగులు వంకలు
కర్నూలు జిల్లాలో కొట్టుకుపోయిన కారు
ప్రాణాలతో బయటపడ్డ కర్నాటక డాక్టర్

అమరావతి,జూన్6(: నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల జోరుగా వర్షాలు పడుతున్నాయి. కోస్తాతీరంలో తెల్లవారుజాము నుంచి వానలుపడుతున్నాయి. ఖరీఫ్ ఆరంభం లోనే వానలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో.. జోరుగా వానలుపడుతున్నాయి. మేడికొండూరు, ఫిరంగీపురం మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మేడికొండూరు రహదారిపై చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విసదలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మేరకపూడి, వేములూరిపాడు గ్రామాల్లో ప్రధాన రహదారిపై చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి. అమీనాబాద్‌లో విద్యుత్ స్తంభం విరిగి ఇంటి ప్రహరీపై పడింది. బాపట్ల జిల్లాలోనూ.. జోరుగా వానలు కురుస్తున్నాయి. పర్చూరు, మార్టూరు, చీరాల, అద్దంకి ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ శబ్దంతో ఎన్నడూలేని విధంగా ఉరుములు రావటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పెనుగాలుల బీభత్సానికి ఇంకొల్లు పర్చూరు రహదారిలో చింత చెట్లు నేలకొరిగాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మార్టూరు, పర్చూరు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో రాత్రి నుంచి సరఫరా నిలిచిపోయింది. చినగంజాం ఉప్పు కొఠార్ల లో వర్షపునీరు నిలిచి.. తీయాల్సిన ఉప్పు వర్షపు నీటికి కరిగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ కుండపోతగా వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి ఉరుములు మెరుపులతో కూడిన జోరు వానలుపడ్డాయి. అమలాపురం లో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షాపు నీరు చేరింది. అంబాజీపేట, మామిడికుదురు, పి. గన్నవరం రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. కొనసీమ జిల్లా ముమ్మిడివరంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా.. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడలో మబ్బులు కమ్మేయడంతో చీకటి వాతావరణం తలపించింది. ఈదురుగాలులతో కాకినాడ నగరం, గ్రామీణ మండలాలతో పలుచోట్ల విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో తెల్లవారుజాము నుంచే చిరుజల్లులు కురుస్తున్నాయి.

## అమరావతిలో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణకు విస్తృత ఏర్పాట్లు

అమరావతి : అమరావతిలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూన్ 9న ప్రాణ ప్రతిష్ట, మహాసంప్రోక్షణకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో అవకాశం ఉండడంతో ఇవాళ టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో వీరబ్రహ్మంతో కలిసి అమరావతి ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ మహాసంప్రోక్షణ కార్యక్రమానికి ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, విశాఖ శారద పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర స్వామివారు విచ్చేస్తారని అన్నారు. ఇటీవల పలు రాష్ట్రాల రాజధాని నగరాల్లో నిర్మించిన ఆలయాల కంటే ఇక్కడి ఆలయం చాలా పెద్దదని, సుమారు రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించామని వెల్లడించారు. ఇక్కడ 25 ఎకరాల స్థలం ఉందని, పచ్చదనం పెంచడంతో పాటు ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అర్టీసీ అధికారులతో చర్చించి చుట్టుపక్కల ఉన్న వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు.



## గవర్నర్‌తో సీఎం జగన్ దంపతుల మర్యాదపూర్వక భేటీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు భేటీ అయ్యారు. సోమవారం సాయంత్రం రాజ్‌భవన్ వెళ్లి గవర్నర్‌ను.. సతీసమేతంగా సీఎం జగన్ కలిశారు.



# సంపాదకీయం

మంగళవారం 07-06-2022

## క్రికెట్..వినోదం..విషాదం

ఇంగ్లీషువాడు భారతదేశాన్ని వదిలిపోతూ అంటించిన జాఢ్యాలు రెండు.. ఇంగ్లీషు, క్రికెట్! పిల్లలు ఇంగ్లీషు మీడియంలోనే చదవాలి, మాట్లాడాలి, ఆడితే క్రికెట్ మాత్రమే ఆడాలి .. ఈ రెండు చేయనివారు ఒట్టి పిచ్చాళ్లు! పనికిరానివారు అదే గొప్ప అభిప్రాయం తరతరానికి అందివస్తున్న గొప్ప సంప్రదాయం. పిల్లలు చదువుతోపాటు ఆటలూ ఆడాలి. వొంటికి వ్యాయామం అవసరం గనుక. పూర్వం కబడ్డీ, పరుగు పందెం, బ్యాడ్మింటన్ చాలా సహజంగా ఆడేవారు. ఇప్పుడూ ఆడుతున్నారు. కానీ క్రేజ్, ప్రతిష్ట, మీదు మిక్కిలీ మంచి ఆర్థిక స్థాయి కోసం క్రికెట్ ఆడటం జరుగుతోంది.తల్లిదండ్రులు తమ మగ పిల్లల్లో ఎవరికయినా ఈ జాఢ్యం అంటి పొరపాటున అర కొర చాకచక్యం చూపితే.. కాబోయే టెండూల్కర్ అని, కాబోయే కపిల్ అనీ భావించుకుని కోచింగ్ పేరుతో వాడి జీవితాన్ని సదరు కోచ్ చేతిలో పెడుతున్నారు. ఇది గతంలో పట్ట ణాలలో వుండేది. ఇప్పుడు టీ 20లు, ఐపిఎల్ పుణ్యాన గ్రామీణ ప్రాంతాల్లోనూ అదో పెద్ద సోపానంగా భావి స్తున్నారు. పైగా టాలెంట్ సర్చ్ పేరుతో క్రికెట్ సంఘాలు చిన్న వూళ్లలోకి వెళ్లి వారి ఆటను గమనించి నచ్చితే తమ వద్దకు వచ్చేయమని అనడం జరుగుతోంది. అదేదో మహాద్భుతం, ఇక రేపే మనోడు టెస్ట్ ఆడతాడు, పనిగినీ వదిలేసి టీవీ ముందు బైఠాయించాలి అని అమ్మమ్మలు, అమ్మలు సైతం తెగ ఉత్సాహ పడుతున్న రోజులివి. అసలు ఆ ఆట మహత్తే అంత అని అంటూంటారు క్రికెట్‌ను అమితంగా ప్రేమించి తిండీ తిప్పలు మానేసినవారు. ఎందుకంటే, మ్యాచ్‌లు, ప్లేయర్లకంటే ఆ మ్యాచ్‌లను చూస్తూ డబ్బు సంపాదించే ఓ కొత్త దరిద్రం వచ్చిపడింది. దాన్నే ఆంగ్లంలో బెట్టింగ్ అంటారు. ఇది ఐపిఎల్‌తో మరింత విజృంభిస్తోంది. నర నరానా ఆ పిచ్చి ఎక్కించేసుకుంటున్న యువత, చిన్నపాటి వ్యాపార సంస్థలవారు కూడా ఆవేశపడుతున్నారు. క్రమేపీ ఆటను ఆటగా చూడ్డం మానేసి వారి అభిమాన ప్లేయర్ ఆట తీరును కరెన్సీ కాయితా లతో కొలుస్తూ ఆ వేడిలో లక్షలకు లక్షలు కోల్పోతున్నారు. కష్టపడి ఏదో ఒక పనిలో, లేదా వృత్తిలో ఆర్థికంగా మెరుగుపడటం అనేది లోకం హర్షించే పద్ధతి. కానీ కాలక్రమంలో ఆటలతోనూ కోట్లు గడించవచ్చన్నది గొప్ప ఆర్థిక సూత్రం కింద తయారయింది. ప్లేయర్లు ముఖ్యంగా క్రికెట్ ప్లేయర్లు తమ ప్రొఫెషన్‌లో ఉన్నత శిఖరాలు అధిగమించడంలో ఆర్థికంగా బాగానే నిలదొక్కుకుంటారు. దాన్ని ఆట్టే ప్రశ్నించలేం. కానీ వారి ఆటను పిచ్చిగా ప్రేమించి ఆర్థికంగా దిగజారు తున్న కుటుంబాలు తయారు కావడమే ఊహించని పరిణామం! పనీపాటా లేని పదకండు మంది ఆడే ఆటను కోట్లమంది బుద్ధిహీనులు ఎంజాయ్ చేయడంలో కాలం విలువ తెలుసుకోలేకపోతున్నారని పూర్వం ఒక ఆంగ్ల రచయిత అన్నాడు. అప్పుడన్నది ఇప్పుడు అక్షరాలా నిజం. మత్తులో పడితే గమ్మ త్తుగ చిత్తవడం అంటే ఇదేనేమో! ఐపిఎల్‌లో ఆడితే దేశానికి ప్రాతినిధ్యం వహించడం చాలా సులువు అనే గొప్ప రహస్యసారం ప్లేయర్లు కూడా బాగా జీర్ణించుకున్నారు. అంతకుముందు రంజీలో సరిగా ఆడకపోయినా, అదృష్టవశాత్తూ ఏదో ఒక జట్టుకి ఆడేందుకు ఈ టోర్నీకి సెలక్ట్ అయితే మారుమూల అమాయకంగా వుండే చిన్నపాటి ప్లేయర్ కి కూడా కళ్లు నెత్తినెక్కుతాయి. వాడి అదృష్టం మరీ అధికశాతంలో వుంటే వాడికిక తిరుగే వుండదు. ఇప్పటి ట్రెండ్ అదే! ఇక విదేశీ ప్లేయర్ల సంగతి వేరు. వారికి కేవలం డబ్బు కావాలి. ఆట ఎలాగూ మనవాళ్లతో పోలిస్తే బాగానే ఆడతారు.ఒకవేళ ఒకటో రెండో మ్యాచ్‌ల్లో పెద్దగా పరుగులు తీయకపోయినా, వికెట్లు తీయకపోయినా సదరు ప్లేయర్‌కి వచ్చిన నష్టం లేదు. మహా అయితే తర్వాతి రెండు మ్యాచ్‌లను షామియానా కింద చల్లబడుతూ చూడమంటారు అంతే. ఆ తర్వాతా అవకాశం ఇవ్వకపోయినా మరీ అదృష్టమే వాడికి. ఎందుకంటే మొత్తం టోర్నీలో పాల్గొనడానికి ఇవ్వవలసిన మొత్తం సొమ్ము ఎన్నో కొన్ని కోట్లు చచ్చుకుంటూ స్పాన్సర్లు ఇస్తారు! ఈ వ్యాపార ఆట సరళితో చిన్న చిన్న సంస్థలు, పారిశ్రామికవేత్తలు ప్రచారం మాత్రం బాగానే చేసుకో గల్గుతున్నారు. లక్షలు పెట్టి యాడ్స్ రూపంలో అందరి ముందు కనపడితే వచ్చేదానికంటే, ఈ టోర్నీలో వారి సంస్థల పేరు మాటి మాటికీ కనిపించి, వినిపించే ప్రచార హోరు పసిడి కుండల్ని అమాంతం అందిస్తుండవచ్చు అనే అభిప్రాయాలూ లేకపోలేదు. ఒక్క ఆటతో వందల మంది లక్షాధికారులు, కోటీశ్వరులూ కావడం అనేది ఈ రోజుల్లో చూడగల్గుతున్నాం. ఇందుకు ప్రభుత్వాలూ మద్దతునిస్తున్నాయి. రాజకీయ నాయకులు, పోనీ వారి బంధువర్గమో ఆయా స్పాన్సర్లలో భాగమవుతున్నారు. అసలు క్రికెట్ పాలక మండలిలోనే రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులను సభ్యులుగా చూస్తున్నాం. ఇది రాజకీయంగా తమ బలాన్ని ప్రదర్శిస్తుంది. మన దేశంలో దురదృష్టవేమంటే, హాకీని, ఫుట్‌బాల్‌ని అంతగా ప్రోత్సహించలేకపోవడం. పైకి ఏదో కథలు చెప్పడం, ప్రచారం చేయడం, ఒకటి రెండు టోర్నీలకు పెద్ద స్థాయిలో హడావుడి చేయడం తప్ప ప్రత్యేకించి మద్దతు నీయడం అనేది చాలా అయిష్టంగానే జరుగుతోంది. క్రికెట్ వేడితో కొన్ని కుటుంబాలే బాగుపడుతున్నాయి. చాలామటుకు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

# కరతాళ ధ్వనులతో ఎమ్మెల్యే చిన్నయ్యకు అభినందనలు

**సమస్యలు వింటూ ,,పరిష్కారాలు చూపుతూ వార్డుల్లో కలియ తిరిగిన ఎమ్మెల్యే**

**అక్కడికక్కడే హామీలు,అమలుకు ఆదేశం**

**పారిశుద్ధ్యంపై మహిళలకు సూచనలు**

**సంతోషం వ్యక్తం చేసిన పట్టణ ప్రజానీకం**

బెల్లంపల్లి శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య పట్టణంలోని పలు కాలనీలల్లో కలియ తిరుగుతూ,కాలనీవాసులు చెప్పిన సమస్యలను సావధానంగా వింటూ,అక్కడికక్కడే పరిష్కారాలు చూపడం కనబడింది,దీంతో కాలనీ వాసులు కరతాళ ధ్వనులతో ఎమ్మెల్యేను అభినందించారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పూట బెల్లంపల్లి పట్టణంలోని 18వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేతా(శ్రీధర్)వైస్ చైర్మన్ బత్తుల మధు,నియోజకవర్గ నాయకులు గడ్డం భీమగౌడ్ తో కలిసి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పర్యటించారు.ఈ పట్టణ ప్రగతి పాదయాత్ర సందర్భంగా అక్కడ అక్కడ అంతర్గత రోడ్లకు ఆనుకొని గృహ సముదాయాలు ఏర్పాటు చేసుకున్న తీరును చూసి ఎమ్మెల్యే చిన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మన కనీస అవసరాలకు కూడా ఈ రోడ్లు సరిపోవని చింతించారు. సదరు గృహ సముదాయాల యజమానులను పిలిచి అంతర్గత రోడ్ల అవసరం,ఆవశ్యకతపై అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు.అదే విధంగా మరుగుదొడ్లకు సంబంధించి సెప్టిక్ ట్యాంక్ ఆవశ్యకతపై సైతం కాలనీ వాసులకు అవగాహన కల్పించారు.ఇవేగాక కాలనీలో అక్కడక్కడ అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ పైకప్పులు మరియు డ్రైనేజి కాలువల నిర్మాణాలకు సంబంధించి అక్కడికక్కడే హామీలు ఇచ్చి, త్వరితగతిన పనులు వేగవంతంగా నిర్వహించాలని సదరు వార్డు కౌన్సిలర్,సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు,ఇదే క్రమంలో అక్కడే ఉన్నా వార్డు ప్రజానీకం పెద్దఎత్తున కరతాళధ్వనులతో ఎమ్మెల్యే చిన్నయ్యకు అభినందనలు తెలియజేశారు.అంతకు ముందు సాధికాన సముదాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వార్డు ప్రజానీకం మాట్లాడుతూ ఎమ్మెల్యే గారు మా వార్డులో కలియ తిరుగుతూ సమస్యల పరిష్కారానికి సత్వర పరిష్కారాలు చూపడం గొప్ప విషయమని వారు కొనియాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ప్రజానీకం మన పైన బాధ్యతతో ఓట్లు వేసి గెలిపించారు గనుక,ప్రతి ఒక్క వార్డు కౌన్సిలర్ విధిగా,బాధ్యతగా వారి వారి వార్డుల్లో పారిశుద్ధ్య పనులతో పాటు అపరిష్కృతంగా

ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని వారికి హితబోధ చేశారు.మీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కౌన్సిలర్ లకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జంపాల రజిత,స్థానిక కౌన్సిలర్ కొక్కెర చందు,టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనెటి సత్యనారాయణ నాయకులు ఇడ్లి సత్తన్న,పోలు శ్రీనివాస్,రేవెల్లి విజయ్, ఎలిగేటి శ్రీనివాస్,చిట్యాల మధు, నెల్లి రమేష్,కేమిశెట్టి శ్రీనివాస్, గురుండ్ల సత్యనారాయణ,అన్వర్ ఖాన్,చాంద్ పాష,బాబా,గోరె,తాజ్, రహమతుల్లా ఖాన్,బీమ శంకర్, నవం సతీష్, మంతెన భాస్కర్,అశోక్,దాసరి శివ,చక్రధర్,వెంకటేష్ తో పాటు తదితర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# జనసేనకు దూరమా మెగా ఫ్యాన్స్

విజయవాడ, జూన్ 6, మెగా అభిమానులందర్నీ జనసేన కోసం పని చేసేలా ఓ పెద్ద కార్యక్రమాన్నే జనసేన అగ్రనేతలు చేపట్టారు. కొద్ది రోజుల కిందట.. చిరంజీవి, పవన్, రామ్ చణ్ అభిమానుల పేరుతో విజయవాడలో ఓ సమావేశం నిర్వహించి.. అందరూ జనసేనకే పని చేయాలని నిర్దేశించారు. తర్వాత వరుసగా అభిమానులతో సమావేశం పెడుతున్న నాగబాబు? జనసేన కోసం పని చేయాలని నిర్దేశిస్తున్నారు. తాజాగా మంగళగిరిలో మరోసారి నాదెండ్ల మనోహర్ చిరంజీవి అభిమానులతో భేటీ అయ్యారు. జనసేన కోసం అందరూ పని చేయాలని సూచించా?రు. చిరంజీవి అభిమానులు జనసేన కోసం పని చేయడం లేదని ఎందుకు అనుకుంటున్నారో కానీ ఇలా వరుసగా సమావేశాలు నిర్వహిస్తూండటం మాత్రం ఆసక్తి రేపుతోంది. పైగా నాగబాబు .. జనసేన కోసం పని చేసే వారు మాత్రమే అభిమానులని విశాఖలో వ్యాఖ్యలు చేయడం కూడా వైరల్ అయింది. నిజానికి మెగా ఫ్యాన్స్ అంటే చిరంజీవి ఫ్యాన్సే. ఆయన ఫ్యాన్సే ఇతర మెగా ఫ్యామిలీకి ఫ్యాన్స్ గా ఉన్నారు. ప్రత్యేకంగా లేరు. ఆ విషయాన్ని అందరూ ఒప్పుకుంటారు. అయినా అభిమానుల్ని ఎందుకు అలా ఒత్తిడి చేస్తున్నారో వారికి కూడా అర్థం కావడం లేదు. చిరంజీవి నేరుగా జనసేనకు మద్దతు ప్రకటించలేదు. కానీ ఆయన తమ్ముడి వైపు కాకుండా ఇతర పార్టీ వైపు ఉంటారని ఎవరూ అనుకోరు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నానని ఆయన పదే పదే చెబుతున్నందున రాజకీయ పరమైన స్టేట్‌మెంట్ లు ఇచ్చే అవకాశం లేదు. అందుకే ఆయన తరపున నాగబాబు, పవన్ కల్యాణ్ మాట్లాడాతున్నారు. అయితే మెగాభిమానులు సీరియస్‌గా తీసుకోవడం లేదని అనుకుంటున్నారేమో కానీ అదే పనిగా ఒత్తిడి చేస్తున్నారు.

# డోలాయామానంలో రెబల్ ఎమ్మెల్యేలు

విజయవాడ, జూన్ 6, టీడీపీ నాకు ఎన్నో చాన్సులిచ్చింది.. ఎదిగాను.. కానీ వైసీపీలో చేరాను అని ఘనంగా లేఖలో రాసుకున్న వాసుపల్లికి తగిన శాస్తి జరిగిందని టీడీపీ నేతలు శాపనార్థాలు పెడుతున్నారు. వాసుపల్లి గణేష్ ఇక వైసీపీకి దూరమయినట్లే. ఆయనను ఎవరూ దగ్గరకు తీయరు. టీడీపీలోకి అసలు రానీయరు. జనసేనలో చాన్స్ ఉండొచ్చు. కానీ ఆయన రికార్డు చూసి పవన్ ఏమనుకుంటారో తెలియదు. వాసుపల్లి పనైపోయింది.. ఇప్పుడు అందరూ వైసీపీలో చేరిన మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటి అన్న చర్చ ఏపీ రాజకీయాల్లో జరుగుతోంది. గన్నవరం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైసీపీలో చేరిన ఎమ్మెల్యేల్లో ఒకరు వల్లభనేని వంశీ. ఆయనపై పేదలకు ఇచ్చిన ఓ స్థలం విషయంలో చిన్న కేసు నమోదు కాగానే వెళ్లి వైసీపీలో చేరిపోయారు. సైలెంట్ గా ఉంటే సరిపోయేది కానీ చంద్రబాబును.. లోకేష్‌ను.. భువనేశ్వరిని అత్యంత దారుణంగా తిట్టి.. ప్రజల్లో చులకన అయిపోయారు. ఈ తిట్లనే చూపించి వైసీపీ నేతలు కూడా వంశీ అసలు మనిషే కాదని.. టిక్కెట్ ఇస్తే పని చేయమని అంటున్నారు. వైసీపీ క్యాడర్ ఎవరూ ఆయనకు సపోర్ట్ చేయడం లేదు. పనులు జరుగుతాయన్న నమ్మకంతో ఆయన వెంట తిరుగుతున్న వారు మాత్రమే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తారా లేదా అన్నది కూడా స్పష్టత లేదు. ఆయన వల్ల మైనస్ అవుతుందని అనుకుంటే పక్కన పెట్టేస్తారు. ఓ రకంగా వంశీ పూర్తిగా దెబ్బతిన్నట్లేనని చెబుతున్నారు. ప్రభుత్వం మారితే.. గన్నవరంలో ఆయన గెలిచినా నరకం చూపించడం ఖాయమన్న అభిప్రాయం టీడీపీలో గట్టిగా వినిపిస్తోంది. 21014 ఎన్నికల్లో గుంటూరు తూర్పు లో ముస్లింలకు ఇవ్వకుండా ఆర్యవైశ్యకు ఇవ్వాలని చంద్రబాబు ప్రయోగం చేశారు. మద్దాలి గిరి అనే నేతకు చాన్సిచ్చారు. గట్టి పోటీ ఇచ్చిన ఆయన ఓడిపోయారు. పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ ఐదేళ్లు ఆయనే ఎమ్మెల్యే అన్నట్లుగా పెత్తనం చేశారు. ఆయన నమ్మకంగా ఉంటారని నమ్మిన చంద్రబాబు 2019లో కమ్మ లేదా కాపు సామాజికవర్గాలకు ఇవ్వాలని గుంటూరు పశ్చిమ స్థానాన్ని ఇచ్చారు. అన్ని చోట్లా ఓడిపోయినా ఆయన గెలిచారు. కానీ వెంటనే వైసీపీకి ఫిరాయించారు. తనకు ఉన్న కొన్ని పత్తి మిల్లుల బకాయిల కోసం చేరిపోయారు. ఇప్పుడు ఆయన వైసీపీలో ఉన్నాడా లేడా అన్నట్లుగా పరిస్థితి ఉంది. వచ్చే ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇచ్చేచాన్సే లేదని ఇప్పటికే చెప్పుకుంటున్నారు. అక్కడ అప్పిరెడ్డి కాచుకుని కూర్చున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన యేసురత్నం కూడా ఉన్నారు. మోదుగుల వేణుగోపాల్ రెడ్డి కూడా అదే ప్రయత్నంలో ఉన్నారు. మద్దాలి గిరి ఇక ఎమ్మెల్యే అయ్యే యోగం కాదు కదా పోటీ చేసే అవకాశం కూడా రాదని వైసీపీ లోనే క్లారిటీ వచ్చేసింది. నాకేమైనా గ్రానైట్ బిజినెస్‌లు ఉన్నాయా ఏమిటి పార్టీ మారడానికి అని పెద్ద పెద్ద మాటలు చెప్పిన కరణం బలరాం? వైసీపీలో చేరిపోయారు. ఇందుకు ఆయన చెప్పిన కారణాలు చెప్పుకోవచ్చు కానీ.. ఇప్పుడు అక్కడ ఆమంచి సెగను ఎదుర్కొంటున్నారు. జగన్మోహన్ రెడ్డికి ఉన్న కుల వ్యతిరేకత ప్రకారం చూస్తే.. చివరికి కరణం బలరాంకు హ్యాండిచ్చి? ఆమంచికే చీరాల చాన్సిస్తారు. కుదిరితే పర్చూరులో పోటీ చేసుకోమని కరణం కుమారుడికి ఆయన చెప్పే అవకాశం ఉంది. లేకపోతే.. అద్దంకి వైపు పంపుంతారన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే.. కరణం .. ఆయన కుమారుడి రాజకీయ జీవితం అంతటితో ముగిసిపోయినట్లేనని చెబుతున్నారు..ఇకవాసుపల్లి గణేష్ కుమార్ సమన్వయకర్త పదవి నుంచి తప్పుకుని అధికార వైసీపీకి షాక్ ఇచ్చారు. టీడీపీ నుంచి వచ్చిన తనకు వైసీపీలో విలువ లేకుండా పోతుందని వాసుపల్లి గత కొంతకాలంగా మదనపడుతున్నారు. ఇన్నాళ్లూ ఉత్తరాంధ్ర విజయసాయిరెడ్డి ఇన్ ఛార్జిగా ఉండటంతో పంటి బిగువున ఉన్నారు. ఇటీవల పార్టీ హైకమాండ్ ఇన్ ఛార్జిగా వైవీ సుబ్బారెడ్డిని నియమించింది. అప్పుడయినా తనకు ప్రాధాన్యత దక్కుతుందని వాసుపల్లి గణేష్ కుమార్ భావించారు. కానీ పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు లేదని గ్రహించిన ఆయన ఇన్ ఛార్జి పదవికి రాజీనామా చేశారు. వాసుపల్లి గణేష్ కుమార్ 2014, 2019లో టీడీపీ? నుంచి విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. కొన్నాళ్ల క్రితం వైసీపీకి ఆయన మద్దతుదారుగా మారిపోయారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో మరోసారి వైసీపీ నుంచి పోటీ చేసి గెలవాలని ఆయన తొలుత భావించారు. అప్పటికే అక్కడ వైసీ?పీ నేతలుగా ఉన్న ద్రోణంరాజు శ్రీవాత్సవ, రెహ్మాన్, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కోలా గురువులు వేర్వేరు వర్గాలుగా ఇక్కడ ఉండి వాసుపల్లిక తలనొప్పిగా మారారు. ఎందుకు ఈ పార్టీలోకి వచ్చానా? అని ఆయన తల పట్టుకోని రోజంటూ లేదు. దీనికి కారణం వైసీపీలో వాసుపల్లికి వ్యతిరేకంగా ఉన్న గ్రూపులను హైకమాండ్ ప్రోత్సహిస్తుండటమే. కార్పొరేషన్ ఎన్నికలు వాసుపల్లికి మరింత అసంతృప్తిని రేగేలా చేశాయి. వాసుపల్లి టిక్కెట్ నిరాకరించినా ఇండిపెండెంట్లుగా పోటీ చేసి విజయం సాధించిన కార్పొరేటర్లు నేడు ఆయనపై తిరగబడుతున్నారు.

# ఆగండి.. ఆగండి.. పై రచ్చ.. చర్చ

విజయవాడ, జూ? 6,పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ ఆలోచనలో పడింది. ఎవరినీ దీనిపై కామెంట్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా సీనియర్ నేతలకు, పార్టీ అధికార ప్రతినిధులకు ఈ ఆదేశాలు అందినట్లు తెలిసింది. పవన్ వ్యాఖ్యలపై చంద్రబాబు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, అప్పటి వరకూ ఆయన వ్యాఖ్యలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని అంతర్గతంగా ఆదేశాలు జారీ చేశారు. తాము గతంలో తగ్గామని, ఈసారి మిగిలిన పక్షాలు తగ్గాలని పవన్ చేసిన వ్యాఖ్యలపై ఎటువంటి కామెంట్స్ చేయకుండా టీడీపీ నేతలను అధిష్టానం కట్టడి చేసింది. మహానాడు సక్సెస్ అయిన తర్వాత తెలుగుదేశం పార్టీలో ఊపు వచ్చింది. కార్యకర్తల్లో పెల్లుబుకుతున్న ఉత్సాహం తమను విజయం వైపునకు తీసుకువెళుతుందన్న ధీమాతో టీడీపీ నేతలు ఉన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో కిందిస్థాయిలో జనసేన, టీడీపీ ద్వితీయ శ్రేణి నేతల మధ్య సవాళ్లు మొదలయ్యాయి. జనసేనకు బలం లేదని, టీడీపీ నాయకత్వాన్ని అంగీకరిస్తేనే మంచిదని, ప్రజలు టీడీపీ వైపు ఉన్నారని టీడీపీ నేతలు అంటుండగా, జనసేన నేతలు మాత్రం ఈసారి తమ ఓటు బ్యాంకు ద్వారానే విజయం లభిస్తుందన్న విషయాన్ని విస్మరించవద్దని అంటున్నారు. ఇలా కిందిస్థాయిలో మొన్నటి వరకూ సఖ్యతగా ఉన్న జనసేన, టీడీపీ వర్గాలు ఇప్పుడు సవాళ్లు విసురుకుంటున్నాయి. ఎవరూ తమ ఆధిపత్యాన్ని వదులుకునేందుకు సిద్ధపడటం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రాంతంలో రెండు పార్టీల క్యాడర్ ఒప్పందం కుదుర్చుకుని బరిలోకి దిగాయి. కొన్ని సీట్లను కైవసం చేసుకున్నాయి. అధినాయకులతో సంబంధం లేకుండా కుదుర్చుకున్న పొత్తులు సానుకూల ఫలితాలు ఇచ్చాయి. అయితే టీడీపీ నేతలు మాత్రం మరోమారు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. జనసైనికులు మాత్రం ఈసారి పవన్ కల్యాణ్ కు ఛాన్స్ ఇవ్వల్సిందేనని పట్టుబడుతున్నారు.

దూకుడు పెంచిన జనసేన

ఏపీ రాజకీయాల్లో జనసేన పార్టీ దూకుడు పెంచింది. పవన్ కళ్యాణ్‌ను ఉమ్మడి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని కోరుతున్న జనసేన మరో వైపు క్షేత్రస్థాయిలో తన పని తాను చేసుకుపోతోంది. ఈ కృషిలో పాలుపంచుకోవాలని చిరంజీవి ఫ్యాన్స్‌ను ఆ పార్టీ కోరింది. అభిమాన సంఘాలన్నీ రాజకీయ ప్రక్రియలో భాగం కావాలని మెగా అభిమానులను జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. మంగళగిరి జనసేన కార్యాలయంలో చిరంజీవి యువత ప్రతినిధులతో మనోహర్ సమావేశమయ్యారు. ఇందులో భాగంగా మెగా అభిమాన సంఘాల నాయకులతో నాదెండ్ల మనోహర్ మంగళగిరిలో సమావేశయ్యారు. అంతా ఇంటిగ్రేట్ అవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ముందుకు వెళ్లి బాధితులకు సాయం అందించడంలో చిరంజీవి అభిమానులు ఎప్పుడూ ముందుంటారని నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు.అభిమాన సంఘాలు రాజకీయ ప్రక్రియలో భాగమై మరోసారి పొరపాటు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. పవన్ కళ్యాణ్‌ని ముఖ్యమంత్రి చేయడానికి మెగా అభిమానులు కృషి చేయాలని కోరారు. వంద శాతం జనసేన జెండా మోసేందుకు అంతా సిద్ధంగా ఉండాలని అన్నారు. గ్రామస్థాయి వరకు పార్టీని తీసుకువెళ్లాలని సూచించారు.పార్టీ ప్రయాణంలో అభిమానులకు స్థానం కల్పించే ఏర్పాటు చేస్తామని నాదెండ్ల చెప్పారు. పార్టీ క్రియాశీలక సభ్యులకు త్వరలో కిట్లు పంపిణీ చేస్తామని, అలాగే వచ్చే నెల నుంచి శిక్షణా తరగతులు ఉంటాయని.. అందులో అభిమాన సంఘాలు భాగస్వాములు కావాలన్నారు. క్షేత్రస్థాయిలో అభిమాన సంఘాలను పార్టీలో కలిపే ప్రక్రియను మూడు నెలల్లో పూర్తిచేద్దామన్నారు. జనసేన విజయంలో తమవంతు పాత్ర పోషించేందుకు చిరంజీవి యువత ప్రతినిధులు సంసిద్ధత వ్యక్తంచేశారు

# ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాలో భారీ వర్షాలు

**చేపల కంచేరులో పిడుగుపాటుకు బాలుడు మృతి**

అమరావతి జూన్ 6 : ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కర్నూలు జిల్లా హాలహర్వి మండలంలో భారీ వర్షం కురిసింది. ఇక్కడ 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిట్రపట్టి, గూళెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మెదేహాల్ వద్ద తాత్కాలిక వంతెన కోతకు గురైంది.నెల్లూరు, కావలి, గుడ్లూరులో ఈదురు గాలులతో వర్షం కురిసింది . తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో సైతం పలుచోట్ల వర్షం రాజమహేంద్ర వరం, కోనసీమలో కుండపోత వర్షం పడింది . విశాఖ జిల్లా రుషికొండ, ఎండాడ, డెయిరీఫామ్ ప్రాంతాల్లో వర్షం నమోదయింది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం చేపల కంచేరులో పిడుగుపాటుకు కారి చిన్న (16) అనే బాలుడు మృతి చెందాడు.

# వైకాపా పాలనలో పెరిగిన కష్టాలు

విజయవాడ వైసీపీ పాలనలో ప్రజలకు కష్టాలు పెరిగాయని సీపీఎం నేత మధు అన్నారు.వైసీపీ, బీజేపీ ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జులై 11న కలెక్టరేట్లను ముట్టడిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ కష్టాలకు కారణమైన బీజేపీతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జత కట్టడం దారుణమని మండిపడ్డారు. ముందస్తు ఎన్నికల పేరుతో జగన్ ప్రజా సమస్యలను తీర్చడం మానేసి ప్రజల దృష్టిని దారి మళ్లిస్తున్నారన్నారు. కాంట్రాక్టు ,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వైసీపీ పాలనలో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వైసీపీ నాయకులు విశాఖలో భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. భూఅక్రమణలపై ఆందోళన నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తున్న వారిని అరెస్టులు చేయడం దుర్మాగమైన చర్య అని మధు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



# కమలం కమిటీల్లో ప్రక్షాళన




హైదరాబాద్, జూన్ 6, (న్యూస్ పల్స్)వచ్చే నెలలో హైదరాబాద్ లో జరగబోయే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలను పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ సమయంలో మోర్చాల నేతలు ప్రజా సమస్యలపై దృష్టిసారించకుండా మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించడంపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సీరియస్ గా ఉంది. నేతల పనితీరుపై రాష్ట్ర నాయకత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. మోర్చాల తీరు బాగోలేకపోవడంతో ప్రక్షాళన చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో విఫలమవ్వడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జూబ్లీహిల్స్ పబ్ ఘటనపై కూడా మహిళా మోర్చా తూతూమంత్రంగా పోరాటం చేపట్టడంపై బీజేపీ నాయకత్వం సీరియస్ గా తీసుకుంది. దీంతో మహిళా మోర్చా బాధ్యతలను కొత్త వారికి అప్పగించాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇవి ఎవరికి అప్పగిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎవరిని నియమించాలనే అంశంపై రాష్ట్ర నాయకత్వం దృష్టిసారిస్తున్నట్లు సమాచారం.బీజేపీ రాష్ట్ర నాయకత్వం మోర్చాల పనితీరుపై ఫుల్ ఫోకస్ పెట్టింది. పనిచేయని వారిపై వేటు తప్పదని ఇప్పటికే హెచ్చరికలు చేసింది. అయినా తీరు మారకపోవడంతో మార్చడమే ప్రత్యామ్నాయమనే భావనలో రాష్ట్ర నాయకత్వం ఉంది. రాష్ట్రంలో మహిళలపై నిత్యం ఎక్కడో చోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి.

# షరతులు.. పొత్తులు...

## కండిషన్స్ అప్లై అవుతాయా

ఒంగోలు, జూన్ 6, తెలుగుదేశం పార్టీ అశక్తతను పవన్ కల్యాణ్ ఈసారి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ఆయన మాటలను బట్టి అర్థమవుతుంది. టీడీపీకి వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ధైర్యమూ, శక్తి లేదు. ఒంటరిగా పోటీ చేసినా మరోసారి ఓటమి ఎదురయితే ఈసారి పార్టీ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అందుకే టీడీపీ వచ్చే ఎన్నికల్లో పొత్తులను తప్పకుండా కోరుకుంటుంది. ప్రధానంగా జనసేనతో పొత్తు పెట్టుకుని వెళ్లాలన్న టీడీపీ ఆలోచన ఈసారి తనకు అనుకూలంగా మార్చుకోవడానికే జనసేనాని సిద్ధమయినట్లే కనపడుతుంది. తెలుగుదేశం పార్టీ 175 నియోజకవర్గాల్లో బలంగా ఉంది. అయితే అది అధికార వైసీపీని ఓడించేంత బలం ఉందా? లేదా? అన్నది సందేహమే. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దెబ్బకొడతాయా? అన్న ఆందోళన టీడీపీ నేతల్లో ఉంది. అందుకే అగ్రనాయకత్వం నుంచి కిందిస్థాయి వరకూ జనసేనతో పొత్తు కోరుకుంటున్నారు. జనసేన కలసి వస్తే ఉత్తరాంధ్ర నుంచి నెల్లూరు జిల్లా వరకూ తమకు తిరుగు లేదని భావిస్తున్నారు. రాయలసీమలో జనసేన ప్రభావం పెద్దగా లేకున్నా కోస్తాంధ్రలో అధిక స్థానాలను గెలుచుకుని అధికారంలోకి రావచ్చన్నది చంద్రబాబు ఆలోచన. అందుకే అందరూ కలసి రావాలని తాము నాయకత్వం వహిస్తామని చంద్రబాబు గతంలో చెప్పారు. న నిన్న జనసేన విస్తృత స్థాయి సమావేశంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు టీడీపీకి ఇబ్బందికరంగా మారాయి. రెండు దఫాలు తాము తగ్గామని, ఈసారి మిగిలిన వారు తగ్గాలని ఆయన చేసిన వ్యాఖ్యలు టీడీపీలో చర్చనీయాంశమయ్యాయి. మొన్నటి వరకూ ఈసారి జనసేన ఎక్కువ శాసనసభ స్థానాలను కోరుకుంటుందని టీడీపీ నేతలు భావించారు. కానీ పవన్ కల్యాణ్ మాటలను చూస్తుంటే ఏకంగా ముఖ్యమంత్రి పదవిని కోరుకుంటున్నట్లుందన్నట్లుందని వారు అభిప్రాయపడుతున్నారు. 2024 ఎన్నికల్లో తాము తగ్గమని స్పష్టం చేశారు. అనుభవం ఉన్న చంద్రబాబుకు కాకుండా పవన్ కల్యాణ్ కు ఎలా సీఎం పదవి ఇస్తారన్న చర్చ ఇప్పుడే మొదలయిందిమరోవైపు మహానాడు సూపర్ సక్సెస్ అయిందని భావిస్తున్న టీడీపీ నేతలు తాము కూడా తగ్గేదేలే అన్నట్లు క్షేత్రస్థాయిలో వ్యవహరిస్తున్నారు. ఈసారి ప్రజలు తెలుగుదేశం పార్టీకి అధికారం ఇవ్వాలనుకుంటున్నారని, జనసేన పార్టనర్ గా వస్తే మంచిదే గాని షరతులకు లొంగే ప్రసక్తి లేదని వారు అంటున్నారు. షరతులు పెట్టేంత బలం జనసేనకు ఉందా? లేదా? అన్నది ఒకసారి పరిశీలన చేసుకోవాలని కూడా టీడీపీ నేతలు సూచిస్తున్నారు. బీజేపీ కూడా టీడీపీతో కలవాలంటే ముఖ్యమంత్రి అభ్యర్థిగా పవన్ కల్యాణ్ ను ప్రకటించాలన్న షరతు విధించే అవకాశముంది. మొత్తం మీద ఏపీలో ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నా... పవన్ కామెంట్స్ తో పొత్తుల విషయంలో మాత్రం కొంత సందిగ్ధత ఏర్పడినట్లే కనపడుతుంది.

# రివర్స్ గేర్ లో రాజ్యసభ్యుల లెక్కలు

విజయవాడ, జూన్ 6, జగన్ రాజకీయంగా తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్ లో ఇబ్బందులు కలిగించక మానవు. ఆయన అధికారంలో ఉంటే సరే.. లేకుంటే మాత్రం ఆయన నిర్ణయాలు కొన్ని ఆయనకే రివర్స్ అవుతాయి. అందులో ముఖ్యంగా రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ఒకటి. రాజ్యసభ అభ్యర్థులుగా తెలంగాణకు చెందిన ఆర్. కృష్ణయ్య, బీదమస్తాన్ రావు, విజయసాయిరెడ్డి, నిరంజన్ రెడ్డిలను ఎంపిక చేశారు. ఇందులో నిరంజన్ రెడ్డి, విజయసాయిరెడ్డి ఆయనకు అత్యంత ఆప్తులు. నమ్మకస్థులు. తొలి నుంచి జగన్ వెంట నడిచిన వారే. ఇక మరో ఇద్దరి సంగతి ఏంటన్న చర్చ జరుగుతుంది. నలుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో డీఎస్ శ్రీనివాస్ ను కాంగ్రెస్ నుంచి వస్తే తీసుకుని రాజ్యసభ స్థానం కేసీఆర్ ఇచ్చారు. కానీ చివరకు ఆయన పార్టీకి తలనొప్పిగా తయారయ్యారు. ఇటు అనర్హత వేటు వేయలేక, ఆయనపై చర్యలు తీసుకోలేక మొన్నటి వరకూ కేసీఆర్ ఇబ్బందులు పడిన విషయాన్ని ఇప్పుడు కొందరు గుర్తు చేస్తున్నారు. రాజ్యసభ స్థానాలను ఎంపిక చేసేటప్పుడు నమ్మకం, పార్టీ పట్ల విధేయత వంటివి చూడాలని చెబుతారు. ఎందుకంటే ఆరేళ్లపాటు ఉండే ఈ పదవి ముఖ్యమైనది. ఇప్పటికే జగన్ కు నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుతో తలబొప్పి కడుతుంది. ఇక కొత్తగా ఎంపికయిన నలుగురిలో ఇద్దరి పరిస్థితి భవిష్యత్ లో అనుమానించదగినదేనని అంటున్నారు. ఒకవేళ 2024లో జగన్ అధికారంలోకి రాలేకపోతే ఇద్దరు పార్టీకి వ్యతిరేకంగా మారే అవకాశమూ లేకపోలేదు. అందులో బీద మస్తాన్ రావు. మొన్నటి వరకూ టీడీపీలో ముఖ్యనేతగా కొనసాగారు. ఇప్పటికే టీడీపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారంటారు. ఆయన సోదరుడు బీద రవిచంద్ర తెలుగుదేశం పార్టీలో ముఖ్య భూమికను పోషిస్తున్నారు. అధికారంలోకి మళ్లీ జగన్ వస్తే ఈయన నుంచి ఎటువంటి ఇబ్బందులు ఎదురుకావు. రాలేకపోతేనే.. పార్టీకి దూరంగా ఉంటారన్నది సీనియర్ నేతలు అంగీకరిస్తున్నారు. కేవలం బీసీ కార్డు ద్వారా ఎంపిక చేస్తే అనేక మంది రాష్ట్రంలో ఉన్నారని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఇవ్వాల్సిన గతి ఏం పట్టిందన్న ప్రశ్నలు కింది స్థాయి క్యాడర్ నుంచి కూడా ఎదురవుతున్నాయి. ఇక రెండో వ్యక్తి ఆర్.కృష్ణయ్య. ఆయన మరో సీతయ్య. ఎవరి మాట వినరు. రేపు ఎన్నికల్లో బీసీల తరుపున చంద్రబాబును దూషించడానికి పని చేస్తారు. భవిష్యత్ లో ఈయన ఎటు వైపు టర్న్ తీసుకుంటారో ఎవరికీ తెలియదు. తెలంగాణ కు చెందిన వ్యక్తి. తెలంగాణ ప్రయోజనాలకు భిన్నంగా కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దల సభలో తన గళం విప్పుతారు. ఆర్. కృష్ణయ్య కూడా టీడీపీ, కాంగ్రెస్ ల నుంచి వచ్చిన వారు. ఏపీ లోని బీసీలను కదిలించే శక్తి ఆయనకు ఉందా? అన్నది కూడా అనుమానమే. ఈయనపై తాజాగా తెలంగాణలో భూ కబ్జా కేసు నమోదయింది. రెండు రాజ్యసభ స్థానాలను జగన్ వేస్ట్ చేశారని పార్టీ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి. భవిష్యత్ లో జగన్ కు ఈ ఇద్దరు తలనొప్పిగా మారతారన్న కామెంట్స్ బలంగా విన్పిస్తున్నాయి.

# టిడిపి నేతల ఆరెస్టు

మధురవాడ పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఋషి కొండలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏసిపి చుక్కాశ్రీనివాసరావు అధ్వర్యం లో పీఎం పాలెం పోలీస్ స్టేషన్ అధికారులు భగ్నం చేశారు వారిని ఋషికొండ వైపు వెళ్లకుండా మధ్య లోనే ఆపేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా లో మాజీ మంత్రి బండారు సత్య నారాయణ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి తన విలాసాల కోసం తన నివాసం కోసం ఋషి కొండను నాశనం చేయడానికి కంకణం కట్టు కున్నారని అంతే కాకమొదలు కూడా కాని పనులకు యాభై శాతం పూర్తి అయ్యిందని సుప్రీం కోర్టు ను సైతం తప్పు దోవ పట్టించడానికి ప్రయత్నం చేశాడని ఎంపీ రఘురామ కృష్ణంరాజు వల్ల సుప్రీం కోర్టు నిజాలు తెలుసుకుని మొట్టికాయలు వేసిందని తెలిపారు

# అక్కడ దోస్తీ... ఇక్కడ కుస్తీ

నెల్లూరు, జూన్ 6, నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక బరిలో బీజేపీ తన అభ్యర్థిని దింపుతోంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ యాదవ్ పోటీకి సై అన్నారు. 'కుటుంబ రాజకీయాలకు తమ పార్టీ వ్యతిరేకం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. 'వైసీపీకి దమ్ముంటే ఓట్లు కొనకుండా.. ఓటర్లను మంత్రులు ప్రలోభాలకు గురిచేయకుండా ఎన్నికలో గెలవాల'ని సవాల్ చేయడాన్ని పరిశీలకులు ఒక పెద్ద జోక్ గా అభివర్ణిస్తున్నారు. 'ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరింద'నే సామెతను సోము వీర్రాజు మాటలు గుర్తుచేస్తున్నాయంటున్నారు. ఓట్లు రావు.. గెలుపు సాధ్యం కాదు.. కనీసం డిపాజిట్ అయినా అనుమానమే.. అయినా.. తగుదునమ్మా అంటూ ఎక్కడ ఉప ఎన్నిక వచ్చినా కమలం పార్టీ పోటీకి సై అంటూ పోటీలో ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ లోని ఏ నియోజకవర్గంలోనూ బీజేపీకి కనీస స్థాయి ఓట్లు కూడా లేవనేది నూటికి నూరుపాళ్లూ వాస్తవం. రాష్ట్రంలో పొత్తులు లేకుండా కనీసం ఒక్క స్థానం కూడా గెలిచిన సందర్భం లేదు. అలాంటిది.. సోము వీర్రాజు అధికార వైసీపీని సవాల్ చేయడం, ఉప ఎన్నికలో పోటీకి దూరంగా ఉండాలన్న టీడీపీ నిర్ణయాన్ని వేలెత్తి చూపడం అతి చేయడమేనని పరిశీలకులు అంటున్నారు. రాజకీయ వర్గాలలో అయితే అసలాయన తెలివి ఉండే మాట్లాడుతున్నారా? అన్న చర్చ జరుగుతోంది. గతంలో ఏపీలో నలుగురు బీజేపీ అభ్యర్థులు గెలిచి అసెంబ్లీ మెట్లు ఎక్కారంటే అందుకు అప్పట్లో ఆ పార్టీకి తెలుగుదేశంతో పొత్తు ఉండటమే కారణం అనడంలో సందేహం లేదు.ఆ విషయాన్ని మరచి, సోము వాగాడంబరానికి పోవడం జోక్ కాక మరేమిటని నిలదీస్తున్నారు. టీడీపీకి స్థిరమైన సిద్ధాంతం లేదట. ఎంత మాట.. ఎంత మాట.. తిరుపతి ఉప ఎన్నికల్లో పోటీ చేసిన టీడీపీ ఆత్మకూరులో ఎందుకు పోటీ చేయలేదో చెప్పాలట. ఇలాంటి డిమాండ్ ఒక జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చేయడం చోద్యంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. సోము వీర్రాజు తీరు 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్నట్లు ఉందని ఎద్దేవా చేస్తున్నారు. పైగా మంత్రుల్ని ఎన్నికల ప్రచారంలో దింపకుండా , డబ్బులు పంచకుండా కేవలం అభ్యర్థులు మాత్రమే ప్రచారంలో పాల్గొని గెలవాలని సోము వీర్రాజు అధికార వైసీపీకి సవాల్ చేస్తున్నారట. సోము వీర్రాజు మాటలు వింటుంటే.. 'నేను కొట్టినట్టు నటిస్తా.. నువ్వు ఏడ్చినట్లు యాక్ట్ చెయ్యి' అన్నట్లు ఉందంటున్నారు. కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకం అనే ట్యాగ్ తో తన అభ్యర్థిని బరిలో దింపుతున్న బీజేపీ.. లోపాయికారీగా వైసీపీతోనే అంటకాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోడీ సర్కార్ తీసుకునే ఏ నిర్ణయానికైనా జగన్, జీ హుజూర్ అనడం అందరికీ తెలిసిన విషయమే కదా అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. అలాగే.. జగన్ ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లినా.. ప్రధాని మోడీ సహా కేంద్రంలోని పెద్దలు అపాయింట్ మెంట్ ఇస్తూనే ఉండడం గమనార్హం. ఢిల్లీ వెళ్లినప్పుడల్లా కేంద్రం పెద్దల నుంచి ఏపీ కోసం జగన్ రెడ్డి ఏమి వరాలు తెస్తారో తెలియదు కానీ.. సొంత విషయాల మీదే ఎక్కువగా ఫోకస్ పెడుతుంటారనే విమర్శలు ప్రతిపక్షాల నుంచి వస్తుంటాయి. ఢిల్లీ స్థాయి పెద్దలు జగన్ రెడ్డికి అనుకూలంగా ఉంటారు. ఏపీలోని బీజేపీ నేతలు మాత్రం జగన్ పార్టీకి సవాళ్లు విసురుతుంటారు. అంటే ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ అన్నట్లు ఆ రెండు పార్టీల తీరూ ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.ఒక పక్కన బీజేపీతో తాను పొత్తులో ఉన్నదీ లేనిదీ జనసేన అధినేత డైరెక్ట్ గా ఎప్పుడూ ఎక్కడా చెప్పరు. కానీ.. రాష్ట్రస్థాయి బీజేపీ నేతలు మాత్రం జనసేనతో, పవన్ కళ్యాణ్ తో తమ దోస్తీ కొనసాగుతోందనే చెప్పుకోవడం విడ్డూరంగా ఉందంటున్నారు.

# సిరులతో కళకళలాడుతున్న తిరుమలేశుడు



## 4 కోట్లకు చేరిన రోజువారీ ఆదాయం

తిరుమల, జూన్ 6, అష్టైశ్వరాలు ప్రసాదించే శ్రీనివాసుడి సన్నిధిలో లక్ష్మీకళ ఉట్టిపడుతోంది. కరోనా కారణంగా తగ్గిన హుండీ ఆదాయం మళ్లీ పుంజుకుంది. టోకెన్లు లేకుండానే దర్శనాలు భక్తులను అనుమతిస్తుండటంతో శ్రీవారి హుండీ ఆదాయం రోజు నాలుగు కోట్లకు చేరింది.వడ్డీ కాసులవాడి దర్శనం కోసం రోజు వేలల్లో భక్తులు వస్తూ ఉంటారు. కోరిన కోరికలు తీర్చే కోనేటి రాయుడికి భక్తులు కానుకలు సమర్పించుకోవడం అనవాయితీ. కాని, కరోనా మహమ్మారి కారణంగా గడిచిన రెండేళ్లుగా తిరుమలను సందర్శించే భక్తుల సంఖ్య బాగా తగ్గింది. ఆ ప్రభావం శ్రీవారి హుండీ ఆదాయంపైనా పడిపోయింది. కరోనా తగ్గినా ఆంక్షల కారణంగా తిరుమలకు భక్తుల రాకపోకలు తగ్గాయి. జూన్ 2020లో దర్శనాల పునరుద్ధరణ తర్వాత హుండీ డైలీ ఆదాయం 20 లక్షల రూపాయల్లోకి పడిపోయింది. ఈ క్రమంలో టీటీడీ అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఒక సమయంలో కార్పస్ ఫండ్ నుంచి డబ్బు తీసి ఉద్యోగులకు జీతాలు చెల్లించాల్సిన పరిస్థితీ ఏర్పడింది. ఈ మధ్య కాలంలో ఆంక్షలన్నీ సడలించి దర్శనాల సంఖ్యను టీటీడీ పెంచడంతో హుండీ ఆదాయంలోనూ పెరుగుదల కనిపిస్తోంది. కరోనా బారిన పడిన అనేక మంది భక్తులు కోలుకుంటే స్వామి వారిని దర్శించుకొని కానుకలు, ముడుపులు చెల్లించుకుంటామని మొక్కుకున్నారు. కరోనా నుంచి కోలుకున్న లక్షలాది మంది భక్తులు పరిమిత సంఖ్యలో దర్శనాల కారణంగా శ్రీవారిని దర్శించుకోలేకపోయారు. దీంతో చాలా మంది మొక్కులు వాయిదా పడుతూ వచ్చాయి. ఏప్రిల్‌లో సర్వదర్శనం టోకెన్ జారీ కేంద్రాల దగ్గర తొక్కిసలాట జరగడంతో టోకెన్లు లేకుండా దర్శనాలకు అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో రెండేళ్లుగా మొక్కులు చెల్లించుకునేందుకు ఎదురు చూస్తున్న భక్తులు శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు బారులుదీరుతున్నారు. దీంతో స్వామివారి హుండీ ఆదాయం పెరిగిపోయింది.గడిచిన కొద్ది రోజులుగా స్వామివారి హుండీ ఆదాయం రోజుకు 4 కోట్లుగా ఉంటుంది. రద్దీ రోజుల్లో ఈ మొత్తం 5 కోట్లు దాటుతోంది. మే నెలలో స్వామివారి హుండీ ఆదాయం అక్షరాల 129 కోట్లు 93 లక్షల 44 వేల రూపాయలు. ఇందులో నాణెల రూపంలో ఆదాయం 6 కోట్లు రాగా ముడుపుల రూపంలో 65 లక్షలు హుండీల్లో పడ్డాయి. దాదాపు ఆరు లక్షల రూపాయల విలువ చేసే చలామణీలో లేని నాణేలు కూడా భక్తులు శ్రీవారి హుండీలో వేశారు. హుండీలో వేసిన నగదులో చిరిగిన నోట్లు 50 లక్షల రూపాయల మేరకు ఉన్నాయి. కరోనా కారణంగా తగ్గిన హుండీ ఆదాయం ఇప్పుడు భక్తుల రాకతో మళ్లీ సిరులతో కళకళలాడుతోంది.

# ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

విజయవాడ, జూన్ 6, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం అవుతుంది. అయితే ఇప్పటి నుంచే ఎన్నికలపై రాజకీయ పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి.ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం అవుతుంది. అయితే ఇప్పటి నుంచే ఎన్నికలపై రాజకీయ పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. ఎలాగైనా అధికారం చేపట్టాలనే కాంక్షతో ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. మళ్లీ అధికారంలోకి రావాలని వైసీపీ సర్కార్ భావిస్తుండగా.. ఎలాగైనా పగ్గాలు చేపట్టాల్సిందేనని టీడీపీ నేతలు(ఆఖ ఒవజీటవతీబ) ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అటు జనసేన కూడా గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేస్తోంది. బీజేపీ సైతం పోరుకు సై అంటోంది. ఈ క్రమంలో రెండేళ్ల ముందే రాష్ట్రంలో ఎన్నికల వేడి రాజుకోవడం ఆసక్తికరంగా మారింది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని బలపరిచే విధంగా ప్రత్యేక వ్యూహ రచనలు చేయాలన్నారు. రాష్ట్రాన్ని అథోగతిపాలు చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు బుద్ధిచెప్పే సమయం తొందరలోనే ఉందని హెచ్చరించారు.విరామం లేకుండా మరింత దూకుడుగా పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు గతంలో చంద్రబాబు సూచించిన విషయం తెలిసిందే. ఒంగోలు మహానాడు ప్రజా విజయంగా చంద్రబాబు అభివర్ణించారు. అరాచక, విధ్వంస పాలనపై తిరుగుబాటుకు మహానాడు వేదిక అయ్యిందన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్.. రాజకీయాలకే అనర్హుడని మండిపడ్డారు. 'క్విట్ జగన్– సేవ్ అంధ్రప్రదేశ్' నినాదాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలకు 6 నెలల ముందు కనిపించే స్పందన.. రెండేళ్ల ముందే కనిపించిందని వెల్లడించారు.

# పవన్ కల్యాణ్ కు ముఖ్యమంత్రిగా ఒక చాన్సు ఇస్తే తప్పేముంది?

అమరావతి జూన్ 6 ఆంధ్రప్రదేశ్ లో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపైన అటు రాజకీయ పార్టీల్లోనూ ఇటు సాధారణ ప్రజల్లోనూ ఇంకోవైపు టీవీ చానెళ్లలోనూ పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు సంబంధించి తన ముందు మూడు ఆప్షన్లు ఉన్నాయని పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో ఒకటి.. జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం రెండోది.. జనసేన–బీజేపీ–టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం మూడోది.. ఒంటరిగా జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయడం. తద్వారా పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు సంబంధించి పొత్తుల విషయంలో తన మనసులోని మాటను ఎలాంటి దాపరికాలు లేకుండా ఎలాంటి అస్పష్టతకు తావివ్వకుండా కుండబద్దలు కొట్టేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో అన్ని పార్టీలు మీడియా సంస్థలు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను విశ్లేషించే పనిలో పడ్డాయి. పవన్ కల్యాణ్ వ్యాఖ్యల ఉద్దేశం ఆయన మాటల్లోని అంతరార్థం ఒకటేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడికి జగన్ మోహన్ రెడ్డికి ఒక అవకాశమిచ్చారు.. కాబట్టి ఈసారి 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా తనకు కూడా ఒక చాన్సు ఇవ్వాలనేదే పవన్ కల్యాణ్ ఉద్దేశమని చెబుతున్నారు. పవన్ వ్యాఖ్యల్లో నిగూఢార్థం పరమార్థం ఇదేనని పేర్కొంటున్నారు.అయితే పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై సహజంగానే అధికార వైఎస్సార్సీపీ బెంబెలెత్తుతోందని చెబుతున్నారు. దమ్ముంటే పవన్ కల్యాణ్ ఒంటరిగా పోటీ చేయాలని ఆ పార్టీ నేతలు సవాళ్లు విసరడం రంకెలు వేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు. మరోవైపు టీడీపీ కౌంపౌండ్ ప్రస్తుతం సైలెంట్ గా ఉంది. మహానాడు సక్సెస్ తో మంచి జోష్ మీద ఉన్న ఆ పార్టీ పవన్ వ్యాఖ్యలపై ఆచితూచి స్పందించాలని యోచిస్తోంది. మరోవైపు బీజేపీ పవన్ కల్యాణ్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేసిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి జనసేన –బీజేపీ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని బీజేపీ నేతలు చెబుతున్నారు.ప్రజల్లో ముఖ్యంగా కాపు సామాజికవర్గంలో పవన్ కు అనుకూలంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని అంటున్నారు . అవినీతి ఆరోపణలతో జైలుకెళ్లిన వైఎస్ జగన్ ను ఎన్నో కేసుల్లో కోర్టుల నుంచి స్టే తెచ్చుకున్న చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసినప్పుడు ఎలాంటి మచ్చ అవినీతి ఆరోపణలు లేని పవన్ కల్యాణ్ కు కూడా ఒక చాన్సు ఇస్తే తప్పేముందని వాళ్లు అనుకుంటున్నారని అంటున్నారు.ముఖ్యంగా రాష్ట్రంలో అతిపెద్ద సామాజికవర్గం కాపులు పవన్ కల్యాణ్ ప్రకటనపై పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో సమాన సీట్లలో పోటీ చేయడం లేదా అధికారాన్ని పంచుకోవడం వంటి వాటి ప్రాతిపదికగానే పొత్తులు ఉంటాయని.. అంతేకానీ ఎవరినో పల్లకీ ఎక్కించడానికి తాము సిద్ధంగా లేమని పవన్ కుండబద్దలు కొట్టిన సంగతి తెలిసిందే. ఈ మాటల్లో అంతరార్థం నిగూడార్థం తనకు కూడా ముఖ్యమంత్రిగా ఒక చాన్సు ఇవ్వండనేదే పవన్ ఉద్దేశమని బల్లగుద్ది చెబుతున్నారు.

# ఇంద్రకీలాద్రిలో బీజేపీ నేత లక్ష్మణ్

విజయబాడ శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి రాజ్యసభ సభ్యుడు .లక్ష్మణ్ వచ్చారు. అయనకు అలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం అలయ అధికారులు కల్పించారు.దర్శనానంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేసి, శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రములు అందజేసారు.

# 15 నుంచి టిడ్కో ఇళ్లు

ఏలూరు, జూన్ 6, పేదల సొంతింటి కల నెరవేర్చడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారు. ఒకపక్క ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు అవకాశాలు కల్పిస్తూనే.. మరోపక్క టిడ్కోలో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ రెండేళ్ల పాటు కోవిడ్ కేర్ సెంటర్లుగా ఉపయోగించడం వల్ల వాటిని లబ్ధిదారులకు అప్పగించడంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం పరిస్థితి మెరుగుగా ఉండడంతో వేగంగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 15 నుంచి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం టిడ్కో అధికారులు, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్లు, మెప్మా అధికారులతో టిడ్కో ఇళ్లపై నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన ఆదేశాలతో అధికారులు రిజిస్ట్రేషన్ల పనులు ముమ్మరం చేశారు. ప్లాట్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. నూతన పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు పట్టణాల్లో 20,784 టిడ్కో ఇళ్లు నిర్మించారు. ఏ కేటగిరీలో 300, బీ కేటగిరీలో 365, సీ కేటగిరీలో 430 చదరపు అడుగుల ఇళ్లు నిర్మించగా, ఇవన్నీ కలిపి 20,784 ఇళ్ల నిర్మాణం జరిగింది. ఇందులో నాలుగు పట్టణాల్లో కలిపి 300 చదరపు అడుగుల ఇళ్లు 6944 నిర్మించగా, ప్రభుత్వం వీటిని లబ్ధిదారులకు ఉచితంగా అందించనుంది. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం పట్టణాలకు సంబంధించి 6048 ఇళ్లను ఫేజ్?1లో లబ్ధిదారులకు ఈ నెల 15 నుంచి అప్పగించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం పట్టణాల్లోని టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్లాట్లను లబ్ధిదారుల పేరిట ఉచిత రిజస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మెప్మా విభాగం అధికారులు ఆయా పట్టణాల్లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు లబ్ధిదారులను తీసుకువెళ్లి ప్లాట్లను రిజస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ నెల 15 నుంచి ఇళ్లు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించడంతో రిజస్ట్రేషన్ ప్రక్రియ మరింత ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఉచితంగా రిజస్ట్రేషన్ చేసి ప్లాట్లు అప్పగించడంపై లబ్ధిదారులు సంతోషంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం పట్టణాలకు సంబంధించి 3758 మందికి ప్లాట్లు రిజస్ట్రేషన్ చేశారు. అందులో భీమవరంలో 900, పాలకొల్లులో 1458, తాడేపల్లిగూడెంలో 1400 చొప్పున ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేపట్టారు. మూడు పట్టణాల్లోని ఫేజ్?1 లబ్ధిదారుల్లో 2577 మంది రూ.68.39 కోట్ల బ్యాంకు రుణాలు పొందారు.

# కత్తిపీటతో దాడి..ముగ్గురికి గాయాలు

ప్రకాశం ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం పిటికాయగుళ. గ్రామంలో లో పక్క ఇంటి వారి పై కత్తి పిటతో దాడి జరిగిన ఘటనలో ముగ్గురికికు గాయాలు అయ్యాయి. ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పిటికాయగుళ గ్రామంలో .పక్క పక్కన ఇళ్ళలో వుంటున్న విజయ్ కుమార్, వాలంటర్ శ్రీవాణి శుక్రవారం పొదుపు కట్టే విషయంలో చిన్న వివాదం పొదుపు లోన్ అమౌంట్ విషయంలో శుక్రవారం చిన్నపాటి ఘర్షణ అయింది. మరుసటి రోజు శనివారం వాలంటరీ అన్న ఊరు నుండి రావడంతో వాలంటర్ తన అన్నకు విషయం చెప్పడంతో అతడు వచ్చి విజయ్ కుమార్ పై దాడి చేశాడు. దానికి ప్రతీకారంగా విజయ్ కుమార్ వాలంటర్ అన్నా, వదినల పై కత్తి పీటతో దాడి చేశాడని స్థానికుల సమాచారం. ఘటనలో వాలంటర్ శ్రీవాణికి నడుముపై గాయం అయ్యాయి. ఆమె అన్న చేతిపై, తలపై తీవ్రగాయాలు కాగా వదినకు ఛాతీపై తీవ్రంగా గాయం అయింది. బాధితులు కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి పోలీసులు ఇరువర్గాల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైకాపా నేతలపై టీడీపీ నేతల దాడి

మచిలీపట్నం కృష్ణా జిల్లా మచిలీపట్నం గరాలదిబ్బ గ్రామంలో టిడిపి వైసిపి నాయకులు మధ్య ఘర్షణ చేలరేగింది. టిడిపి నాయకులు, వైసిపి నాయకులపై దాడి చేసినట్లు సమాచారం. రెండు కుటుంబాల మధ్య ఘర్షణ నేపథ్యంలో గత అర్ధరాత్రి రాళ్లతో దాడి జరిగింది. విచక్షణ రహితంగా, ఆడవాళ్ళ చూడకుండా దాడులు చేసుకున్ఆరు. బందరు తాలుకా పోలీసులు తొమ్మిదిమంది తెలుగుదేశం నాయకులని అదుపులోకి తీసుకున్నారు. ఘటనలో స్వల్ప గాయాలయివారిని మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా వుంది. వారిని విజయవాడ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసారు.

# సీమలో వానలు

తిరుపతి రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కడప, కర్నూలు జిల్లాలో సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కర్నూలు జిల్లా ఆలూరులో భారీ వర్షం కురిసింది. దీంతో ఆలూరు సమీపంలో కల్లివంక వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు దాటుతుండగా ఓ కారు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయింది. కారులో నలుగురు లేదా ఐదు మంది ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తు న్నారు. కారు గుంతకల్లు నుంచి ఆలూరు వస్తుండగా ఘటన చోటు చేసుకుంది. గల్లంతైన కారున పోలీసులు గ్రామస్తుల సాయంతో వెలికితీసారు. కల్లివంక వరద ప్రవాహం వల్ల ఆలూరు నుంచి గుంతకల్లు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు కడప జిల్లాలోని పులివెందులలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ గాలుతో వర్షం దంచి కొట్టింది. వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా పిడుగుల గర్జించడంతో ప్రజలు ఒక్కసారిగా భయబ్రాంతులకు గురయ్యారు. చెట్లు కూలిపోయాయి. మామిడి పంట నేలరాలింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో తొలకరి జల్లులు పలకరిస్తుండడంతో అన్నదాత వ్యవసాయానికి సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



# సైబర్ అలర్ట్



## సోషల్ మీడియా చాటింగ్ లో అమ్మాయిలు, మహిళలు జాగ్రత్త

-: కర్నూలు జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్

అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయకండి

ఫోన్ నెంబర్లు గాని, మీ వ్యక్తిగత సమాచారం గాని, మీ ఫోటోలు గాని షేర్ చేయకండి

మీ వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకండి

కర్నూలు జూన్ 06 -: సోషల్ మీడియాలో అమ్మాయిలు, మహిళలు ముఖ్యంగా యుక్త వయస్సు లో ఉన్న అమ్మాయిలు అపరిచిత వ్యక్తులతో చాట్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్ సోమవారం సైబర్ అలర్ట్ పేరుతో ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా ప్రొఫైల్లో వారు పెట్టిన విధంగా అవతలి వారు నిజ జీవితంలో ఉండకపోవచ్చన్నారు. ఫోన్ నెంబర్లు గాని , మీ వ్యక్తిగత సమాచారం గాని, మీ ఫోటోలు గాని, మీ ఇతర సమాచారం గానీ వారికి షేర్ చేయకూడదన్నారు. మహిళలు / విద్యార్థినులు మీరు ఎవరితోనైనా వీడియో చాట్ చేస్తున్న సమయంలో మితిమీరి ప్రవర్తిస్తే వారు మీకు ఎంత నమ్మకస్తులయినా కూడా స్క్రీన్ రికార్డు చేసుకుని బ్లాక్ మెయిల్ చేస్తారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. మహిళలు మీకు ఎంతపరిచయస్తులైనా / దగ్గరి వారు అయినప్పటికి వారితో ప్రవేట్ ఫోటోలు లేదా విడియోలు షేర్ చేయకూడదన్నారు. ఈ విధమైన సమస్యలు ఏవరికైనా ఎదురైనా, తలెత్తినా అధైర్య పడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి మీ యొక్క పరిధిలో ఉన్న పోలీసుస్టేషన్లలో గాని, సిఐ, డిఎస్పీల వద్ద గాని లేదా జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేయగలరన్నారు. మీ భద్రత పై పోలీసులకు ఎంత భాద్యత ఉందో మీకు కూడా అంతే బాధ్యత ఉందన్నారు. జాగ్రత్త వహించాలన్నారు.

# దిశా యాప్ పై విస్తృతంగా ప్రచారం

## ఎస్ ఐదిశ యాప్ ను విరివిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మహిళా పోలీసు సరస్వతి మైతిలి

కౌతాళం మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దిశ యాప్ పై మహిళల్లో విస్తృతంగా అవగాహన చేసుకోవాలని ఎస్ ఐ నరేంద్ర కుమార్ రెడ్డి మహిళా పోలీస్ సరస్వతి,మైతిలి పేర్కొన్నారు.సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో దిశా యాప్ పై ప్రజలకు అవగాహన కల్పించారు.వారు మాట్లాడుతూ దిశ యాప్ ను విరివిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మహిళల భద్రత రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఇందులో భాగంగానే... ఆపదల్లో ఉన్న మహిళల కోసం దిశ యాప్ రూపొందించి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత ఇంటర్నెట్ సాయంతో దిశ యాప్ను డౌన్లోడ్ చేసుకుని, ఇన్స్టాల్ చేసుకుంటే చాలు.. ఆ తర్వాత ఇంటర్నెట్ ఉన్నా లేకున్నా ఫోన్ ద్వారా ఈ యాప్ను వినియోగించుకోవచ్చు అని సూచించారు. ఎస్.ఓ.ఎస్ బటన్ నొక్కడం ద్వారా గానీ... ఫోన్ను గట్టిగా అటూ ఇటూ ఉపడం ద్వారా గానీ ఆపదలో ఉన్న మహిళలు దిశ కాల్ సెంటర్కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. ఆ తర్వాత ఆపద/ ప్రమాదంలో ఉన్న మహిళలను కాపాడేందుకు దిశ కంట్రోల్ రూమ్ నుంచి పోలీసులకు ఆటోమేటిక్గా సమాచారం అందుతుందని తద్వారా పోలీసుల సేవలు వినియోగించుకుని రక్షణ పొందవచ్చన్నారు. ప్రతీ మహిళ/ అమ్మాయి దిశ యాప్ ను ఇన్స్టాల్ చేసుకుని ఆపద సమయంలో పోలీసుల సేవలు వినియోగించుకునేలా విస్తృతంగా అవగాహన చేయాలన్నారు. అంతేకాకుండా... ప్రజలు రద్దీగా ఉండే పలు కూడల్లో నిర్వహించి 180 కు పైగా దిశ యాప్ను డౌన్లోడ్ చేయించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీసు రామచంద్రయ్య మహిళ పోలిస్ సరస్వతి మైతిలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం



-: కర్నూలు జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్

కర్నూలు జూన్ 06 -:కర్నూలు నగరంలోని కొత్తపేట దగ్గర ఉన్న స్పందన కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి ఐపియస్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం ఇప్పటివరకు 93 ఫిర్యాదులు వచ్చాయి. స్పందనకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ....1) అంగన్వాడి పోస్ట్ ఖాళీగా ఉందని ఆ ఉద్యోగం నా భార్యకు ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశాడని దేవనకొండ మండలం, గుండ్ల కొండ గ్రామానికి చెందిన బీరప్ప రాజు ఫిర్యాదు చేశారు.2) రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేశారని ఆస్పరి మండలం, ముత్తుకూరు గ్రామానికి చెందిన రమేష్ ఫిర్యాదు చేశారు. 3) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో అవుట్సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నకిలీ ఆర్డర్ కాపీ ఇచ్చి డబ్బులు తీసుకొని మోసం చేశారని కర్నూల్, కృష్ణ నగర్ కు చెందిన ఉదయ్ కిరణ్ ఫిర్యాదు చేశారు. 4) నా భర్త రెండో పెళ్లి చేసుకుని నన్ను మోసం చేశాడని కర్నూల్, బాలాజీ నగర్ కు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. 5) కుమారుడు ఆస్తులు తీసుకొని అన్నం పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నాడని కౌతాళం మండలం కు చెందిన నాగేశ్వర రావు ఫిర్యాదు చేశారు.స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి. ప్రసాద్, డిఎస్పీ యుగంధర్ బాబు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని,అబ్కాకాస్ లో చేర్చాలి




-: సిఐటియు నగర కమిటీ డిమాండ్.

కర్నూలు జూన్ 06 -: కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలల పెండింగ్ పడిన జీతాలు అగ్రిమెంట్ ప్రకారం ఇవ్వాలని కోరుతూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్. కృష్ణ అధ్యక్షతన వారి డ్యూటీ పాయింట్ నుండి కలెక్టర్ ఆఫీసు గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి 3వ రోజు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు, సిఐటియు జిల్లా నాయకులు రాజశేఖర్, సి ఐ టి యు సి టి సెక్రెటరీ ఎం.విజయ్ సిఐటియు నగర నాయకులు రామకృష్ణ, పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పని చేసే పారిశుద్ధ కార్మికులకు 3 నెలల నుంచి జీతాలు ఇవ్వక పోవడం వలన కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందనిఅన్నారు, అధికారులకు, ఏజెన్సీ వారికి ఎన్నిసార్లు విన్నవించినా దయ కలగడం లేదని వారు అన్నారు, పారిశుద్ధ్య కార్మికులకు పని అప్పజెప్పడం లో ఉన్నంత నిబద్ధత జీతాలు ఇవ్వడంలో లేకపోవడం బాధాకరమన్నారు, మురికి కాలువలు,చెత్త కుప్పలు, బయోల్యాబ్ వేస్టేజ్, వార్డులో క్లీన్ చేసేటప్పుడు కనీసం బ్లౌజ్ లు, మాస్కులు ఇవ్వకుండా పని చేయించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు, ప్రభుత్వం ఎన్నికల ముందు మాకు ఓట్లు వేయండి సమాజం లో ఎవరు చేయలేని పనిని మీరు చేస్తున్నారు కాబట్టి మీకు మంచి జీతం, మిగిలిన అలవెన్సులు ,పని భద్రత కల్పిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం అడిగిన పట్టించుకోకపోవడం బాధకరమన్నారు, ఏజెన్సీ సూపర్వైజర్ లతో పారిశుద్ధ్య కార్మికులను వేధింపులకు, పని ఇవ్వకుండా నెలలు,నెలలు ఇంటికి పంపించడం చేయడం దుర్మార్గమన్నారు, కాబట్టి జగన్ ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని అగ్రిమెంట్ లో ఉన్న ఊ:549 ప్రకారం 16 వేల రూపాయల జీతం ఇవ్వాలని, ఫైనాన్స్ కమిషన్ తో అప్రూవల్ తీసుకుని హాస్పిటల్ లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను అబ్కాకాస్ లో కలపాలని డిమాండ్ చేయడం జరిగింది, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ప్రభుత్వ దుర్మార్గాన్ని ఏజెన్సీ అధికారులు చేసిన,చేస్తున్న అన్యాయాన్ని ఉద్యమాల ద్వారా తిప్పికొడతామని హెచ్చరించడం అయినది. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల సంఘం నాయకులు కళ్యాణ్ కుమార్, సుజాత, లక్ష్మి, సునీత, ఆశిర్వాదమ్మ, ప్రసాద్, సురేష్, బి సురేష్, మహేష్, నారాయణ, డేవిడ్, నాగన్న, మాధవస్వామి, మురళి, నాగరాజు, భాస్కర్, నాగేష్, రాముడు కార్మికులు పాల్గొన్నారు.

# అట్లీ కోసం 'జవాన్' గా మారిన షారుఖ్.. ఆసక్తికరంగా టైటిల్ టీజర్..!

బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ గత కొంతకాలంగా వరుస పరాజయాలతో సతమతమవుతున్నారు. 2018లో 'జీరో' ఫ్లాప్ అయిన తర్వాత స్టార్ హీరో మరో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేదు. ఈ నేపథ్యంలో స్ట్రాంగ్ కంబ్యాక్ కోసం ఇప్పుడు మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టారు. అందులో కోలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ అట్లీ తో చేస్తున్న సినిమా కూడా ఉంది.షారుఖ్ ఖాన్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ లో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటివరకు ఈ సినిమాకు 'లయన్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో టైటిల్ ను ఖరారు చేసిన మేకర్స్.. తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇచ్చారు.అట్లీ – షారుక్ కాంబోలో రూపొందే సినిమాకు "జవాన్" అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు. ఈ సందర్భంగా ఒకటిన్నర నిమిషాల టీజర్ ను ఆవిష్కరించారు. ఇందులో షారుక్ ఇంతకుముందెన్నడు చూడని సరికొత్త గెటప్ లో కనిపించారు. గాయాలపాలైన ముఖానికి చేతులకు కట్లు కట్టుకుని మాస్ లుక్ తో ఆకట్టుకున్నారు.టీజర్ చివర్లో షారుక్ రెండు వైవిధ్యమైన గెటప్స్ లో కనిపించడంతో 'జవాన్' సినిమాలో షారుఖ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారా? లేదా అతని పాత్రలో రెండు వెరియేషన్స్ ఉంటాయా? అనే సందేహాలు కలుగుతున్నాయి.




మొత్తం మీద బాలీవుడ్ హీరోని అట్లీ సరికొత్త అవతార్ లో పరిచయం చేస్తున్నట్లు ఈ టీజర్ ను బట్టి అర్థం అవుతుంది. ఇది సినిమాపై అంచనాలు రెట్టింపు చేస్తోంది."జవాన్" చిత్రాన్ని 2023 జూన్ 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు తమిళం మలయాళం కన్నడ హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై షారుక్ సతీమణి గౌరీఖాన్ ఈ యాక్షన్ ఎంటర్టైనర్ ను నిర్మిస్తున్నారు.ఇకపోతే 'జవాన్' సినిమాలో నయనతార ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్ గా నటిస్తున్నారని సమాచారం. ఇది నయన్ కు హిందీ డెబ్యూ మూవీ. ఇందులో సాన్యా మల్హోత్రా మరో కీలక పాత్రలో కనిపించనుంది. అనేక మంది సౌత్ దర్శకులు నార్త్ లోనూ సత్తా చాటారు. ఈ క్రమంలో అట్లీ తన బాలీవుడ్ డెబ్యూ మూవీతో ఎలాంటి క్రేజ్ అందుకుంటారో చూడాలి.ఇదిలా ఉంటే షారుక్ ఖాన్ ప్రస్తుతం సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో 'పఠాన్' అనే సినిమా చేస్తున్నారు. దీపికా పదుకునే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా 2022 జనవరి 25న విడుదల కాబోతోంది. ఇక రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో షారుఖ్ ఇటీవలే 'డంకీ' అనే చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు.

# మహేష్ కోసం జక్కన్న ఇంకా స్టోరీ లైన్ ని ఫైనలైజ్ చేయలేదా..?

సూపర్ స్టార్ మహేష్ బాబు మరియు దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్ లో ఓ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కనున్న విషయం తెలిసిందే. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేయనున్న ఎస్ఎస్ఎంబీ28 సినిమా తర్వాత ఈ క్రేజీ కాంబో సెట్స్ మీదకు వెళ్లనుంది.ఎస్ఎస్ఎంబీ29 మూవీ కోసం అందరూ ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. జక్కన్న – మహేష్ కలిసి ఎలాంటి సినిమా చేయబోతున్నారు? అది ఏ జోనర్ లో ఉంటుంది? అసలు ఈ సినిమా కథేంటి? అని చర్చిస్తూనే ఉన్నారు.రాజమౌళి తండ్రి కేవీ విజయేంద్ర ప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మహేష్ కోసం ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో ఓ



జంగిల్ బేస్డ్ అడ్వెంచర్ స్టోరీని అనుకున్నట్లు హింట్ ఇచ్చారు. జక్కన్న సైతం ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో మహేశ్ కోసం రెండు ఆసక్తికరమైన స్టోరీ లైన్స్ రెడీగా ఉన్నట్లు జక్కన్న తెలిపారు. సినిమా విడుదలై రెండు నెలలు దాటి పోవడంతో.. రాజమౌళి ఈ గ్యాప్ లో స్టోరీ లైన్ గురించి మహేష్ బాబుతో చర్చించి ఉంటారని అందరూ భావించారు. ముందుగా చెప్పినట్లు ఈ ఏడాది చివరి నాటికి ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తారని అనుకున్నారు. అయితే అసలు ఇంతవరకు దర్శకహీరోలు స్టోరీ గురించి చర్చించలేదని తెలుస్తోంది.ఇటీవల 'మేజర్' ప్రమోషన్స్ లో మహేష్ బాబు ఇంకా రాజమౌళికి సినిమా కథ గురించి ఖచ్చితంగా తెలియదని.. వారు కొన్ని ఐడియాల మీద వర్క్ చేస్తున్నారని.. వాటిలో ఏదీ కన్ఫర్మ్ కాలేదని తెలిపారు. ఈ సినిమా కోసం ఎంతో ఎగ్జైట్మెంట్ గా ఉన్నట్లు పేర్కొన్నారు.మహేష్ సినిమా ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో అడ్వెంచర్ డ్రామాగా ఉంటుందని వార్తలు వచ్చినప్పుడు అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యారు. అయితే ఇప్పుడు మహేష్ దానిని ఖండించడంతో.. సూపర్ స్టార్ కోసం ఎలాంటి కథ రెడీ చేస్తున్నారో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉన్నారు.రాజమౌళి ఒక స్టోరీ లైన్ రెడీ చేయడానికి.. ప్రీ విజువలైజేషన్ మరియు ప్రీ-ప్రొడక్షన్ కోసం ఆరు నుండి ఏడు నెలల సమయం తీసుకుంటారు. ఇదంతా జరిగేలోపు త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేష్ సినిమా కంప్లీట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం యూరప్ లో హాలిడేస్ ని ఎంజాయ్ చేస్తున్న మహేష్.. తిరిగి వచ్చిన తర్వాత ఎస్ఎస్ఎంబీ28 సెట్స్ లో అడుగుపెట్టనున్నారు.ఇదే క్రమంలో రానున్న ఎస్ఎస్ఎంబీ29 చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై సీనియర్ ప్రొడ్యూసర్ కె.ఎల్.నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. అపజయం ఎరుగని దర్శకుడిగా కొనసాగుతున్న రాజమౌళి.. వరుస బ్లాక్ బస్టర్స్ తో ఫుల్ ఫార్మ్ లో ఉన్న మహేష్ కలిసి ఎలాంటి సినిమాని ఆవిష్కరిస్తారో చూడాలి.

# 'ఆచార్య' ఎఫెక్ట్.. అంతా గందరగోళం

మెగాస్టార్ చిరంజీవి ఆచార్య సినిమా పై మెగా అభిమానులతో పాటు ప్రతి ఒక్కరు ఎంతో ఆసక్తి పెంచుకుని ఎదురు చూశారు. కొరటాల శివ దర్శకత్వంలో సినిమా అవ్వడంతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి.కాని ఆచార్య సినిమా డిజాస్టర్ గా నిలిచింది. చిరంజీవి మరియు రామ్ చరణ్ కలిసి నటించినా కూడా అభిమానులను మరియు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఎంటర్ టైన్ చేయడంలో ఆచార్య విఫలం అయ్యాడు.ఆచార్య ఫ్లాప్ ఏమో కాని ఇప్పుడు చిరంజీవి



తదుపరి సినిమాల పై చాలా ప్రభావం పడబోతుంది. ఇప్పటికే గాడ్ ఫాదర్ మరియు భోళా శంకర్ సినిమాలు విడుదలకు సిద్దంగా ఉన్నాయి. గాడ్ ఫాదర్ ను అంతా సవ్యంగా ఉంటే ఆగస్టు లో విడుదల చేయాలనుకున్నారు. కాని ఆచార్య ఎఫెక్ట్ తో విడుదల విషయంలో గందరగోళం నెలకొంది. ఇప్పటి వరకు షూటింగ్ పూర్తి అయ్యిందో లేదో క్లారిటీ లేదు.గాడ్ ఫాదర్ విడుదల అయిన వెంటనే భోళా శంకర్ సినిమాను విడుదల చేయాలనుకున్నారు. ఈ రెండు సినిమాల్లో గాడ్ ఫాదర్ సినిమా లూసీఫర్ కు రీమేక్ అనే విషయం తెల్సిందే. ఇక భోళా శంకర్ సినిమా మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతుంది. ఈ రెండు సినిమాల్లో మళ్లీ కొన్ని మార్పులు చేర్పులు చేయబోతున్నట్లుగా మెగా కాంపౌండ్ నుండి వార్తలు వస్తున్నాయి.చిరంజీవి సినిమా అంటే మెగా ఫ్యాన్స్ తో పాటు ప్రతి ఒక్కరు ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ చూడాలి అనుకుంటారు. వారి అభిరుచికి తగ్గట్లుగా సినిమా లేకుంటే మాత్రం ఖచ్చితంగా ఫలితం అటు ఇటు అయ్యే అవకాశం ఉంది. అందుకే గాడ్ ఫాదర్ మరియు భోళా శంకర్ సినిమాలను ఒకటికి రెండు సార్లు.. ఇద్దరు ముగ్గురి జడ్జ్ మెంట్ లను తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.సినిమాల విడుదల విషయం లో కాస్త గందరగోళం నెలకొన్న త్వరలోనే విడుదల విషయంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటున్నారు. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం గాడ్ ఫాదర్ సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చినా.. కొన్ని సన్నివేశాలను రీ షూట్ చేస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఒక్క ఆచార్య సినిమాల వల్ల చిరంజీవి మూడు నాలుగు సినిమాలపై ప్రభావం పడింది.

# వామ్మో.. ఇదేంటి? రూట్ నీకు చేతబడి తెలుసా? అదేం కాదు బ్రో.. వైరల్!




ఇంగ్లండ్ టెస్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ జో రూట్కు సంబంధించిన ఓ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఇది చూసిన నెటిజన్లు.. "రూట్ అత్యంత ప్రతిభావంతుడైన క్రికెటర్ అని తెలుసు. కానీ ఇలా మ్యాజిక్ చేస్తాడని తెలియదు. ఇదేదో చేతబడిలా ఉంది. మాకు కూడా చెప్పవా?" అంటూ సరదాగా ట్రోల్ చేస్తున్నారు.కాగా న్యూజిలాండ్ ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా లార్డ్స్ వేదికగా ఇరుజట్ల మధ్య తొలి టెస్టు జరిగింది. ఇందులో జో రూట్ అద్భుత అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్లో 11 పరుగులు చేసిన అతడు.. రెండో ఇన్నింగ్స్లో 115 పరుగులు చేసి నాటౌట్గా నిలిచాడు. తద్వారా ఇంగ్లండ్ను విజయతీరాలకు చేర్చి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. పర్యాటక న్యూజిలాండ్ను ఐదు వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఓడించడంలో కీలక పాత్ర పోషించాడు. అంతేగాక ఈ మ్యాచ్ సందర్భంగా టెస్టుల్లో 10 వేల పరుగుల మార్కును అందుకున్నాడు.ఇదిలా ఉంటే.. మ్యాచ్ జరుగుతున్న సమయంలో రూట్ నాన్- స్ట్రైకర్ ఎండ్లో ఉన్న సమయంలో బ్యాట్ను వదిలి నిలబడ్డాడు. అదేంటో బ్యాట్ ఏమాత్రం తొణక్కుండా అలాగే నిల్చున్నట్లుగా కనిపించింది. ఇక పరుగు తీసే క్రమంలో బ్యాట్ను చేతబట్టి ఎప్పటిలాగే ముందుకు సాగాడు.ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. దీంతో రూట్ ఏదో మ్యాజిక్ చేశాడంటూ కొంతమంది కామెంట్లు చేస్తున్నారు. మరికొంత మంది మాత్రం.. రూట్ బ్యాట్ బాటమ్ ఫ్లాట్గా ఉండి ఉంటుంది.. అంతేగానీ అందులో మాయాజాలం ఏమీ లేదంటూ సమాధానం చెబుతున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190